# శస్త్రచికిత్సలంటే భయమక్కర్లేదు

## లైవ్ వర్క్‌షాప్‌లో 'మియాట్' వైద్యులు ● అత్యంత చిన్న కత్తిగాటుతో శస్త్రచికిత్సలు




వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మియాట్ నిర్వాహకులు, విదేశీ వైద్య నిపుణులు నికోలస్ డాల్ తదితరులు

కోడంబాక్కం: శస్త్రచికిత్సలంటే శరీరాన్ని కోసి పాడేస్తారన్న భయం ఇక అక్కర్లేదంటున్నారు మియాట్ ఇంటర్నేషనల్ వైద్యులు. నొప్పి తీవ్రత లేకుండా, రక్తస్రావం జరుగకుండా, చర్మ సౌందర్యం దెబ్బతినకుండా, తక్కువ రోజుల్లోనే సాధారణ జీవితాన్ని గడిపేందుకు అనువుగా అత్యంత కనిష్ఠ కత్తిగాటుతో (మినిమల్ ఇన్వాసివ్) శస్త్రచికిత్సలకు మియాట్ అధిక ప్రాధాన్యతనిస్తుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీఏ మోహన్‌దాస్ పేర్కొన్నారు. గుండె శస్త్రచికిత్సల్లో సత్ఫలితాలిస్తున్న మినిమల్ ఇన్వాసివ్ వాల్వ్ సర్జరీ (ఎంఐవీఎస్)పై యువ వైద్యుల్లో అవగాహన కల్పించేందుకు మియాట్‌లో రెండు రోజులపాటు లైవ్ వర్క్‌షాపులతో సదస్సులు నిర్వహిస్తున్నారు. నందంబాక్కంలోని మియాట్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం ఈ సదస్సును ప్రారంభించారు. యూరప్ దేశమైన స్టుట్‌గార్ట్‌కి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఎంఐవీఎస్ నిపుణుడు ప్రొఫెసర్ నికోలస్ డాల్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మియాట్ ఛైర్మన్ మల్లిక మోహన్‌దాస్, మియాట్ కార్డియో వాస్క్యులర్ కేర్, థొరాయిక్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ వీవీ బాసి, కార్డియో థొరాయిక్ సర్జన్, కన్సల్టెంట్ డాక్టర్ విజిత్ చెరియన్, పృథ్వి మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మోహన్‌దాస్ ప్రసంగిస్తూ... కీ హోల్ సర్జరీలకు మియాట్ ప్రాధాన్యతనిస్తుందని, ఈ క్రమంలో అత్యంత కనిష్ఠ కత్తిగాటుతో చేసే ఎంఐవీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు.

ప్రపంచ వ్యాప్తంగా ఎంఐవీఎస్ బాగా ప్రాచుర్యం పొందిందని, ఇందులో అవయవ మార్పిడి అవసరం లేకుండా దెబ్బతిన్న అవయవ మరమ్మతు చేయడం ద్వారా శస్త్రచికిత్స సంక్లిష్టతను పూర్తిగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. కొత్త సాంకేతికత సహాయంతో తమ వైద్యులు అనుసరిస్తున్న కొత్త వైద్య విధానాలే మియాట్ ప్రగతికి కారణమని మోహన్‌దాస్ అన్నారు. అనంతరం డాక్టర్ నికోలస్ డాల్ ప్రసంగిస్తూ, మియాట్‌లో జరుగుతున్న ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా ఉందన్నారు. డాక్టర్ విజిత్ చెరియన్ స్టుట్‌గార్ట్‌లో పర్యటించి ఎంఐవీఎస్ గురించి ఎంతో అధ్యయనం చేశారని, కొత్త సాంకేతికతను ఉపయోగిస్తూ శస్త్రచికిత్సల్లోని సంక్లిష్టతను తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంఐవీఎస్ బాగా పాపులర్ అయ్యిందని, గుండె జబ్బుల బారిన పడే యువతకు ఈ విధానం చాలా శ్రేయస్కరమన్నారు. మియాట్‌లో రోగులకు అందుతున్న సేవలు చాలా బాగున్నాయని, మియాట్‌తో తమ భాగస్వామ్యం కొనసాగాలని కోరుకుంటున్నానని డాల్ అన్నారు. అంతకుముందు డాక్టర్ వీవీ బాసి స్వాగతోపన్యాసం చేస్తూ, మియాట్‌లోని అన్ని శాఖల్లోను ఎంఐవీ విధానంలో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నామని పేర్కొన్నారు. యువ వైద్యులు ఈ శస్త్రచికిత్సా విధానాన్ని నేర్చుకోవాలని, ఇందుకు సహనం, నైపుణ్యం చాలా అవసరమని బాసి సూచించారు. చివరిగా, డాక్టర్ విజిత్ చెరియన్ ఎంఐవీఎస్ విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.